సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 139 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం, 08 అక్టోబర్ 2025 | పేజీలు : 4



లొంగిపోయిన మావోయిస్టు

## రూబెన్

- వివరాలు వెల్లడించిన వరంగల్ సీపీ

4 లో



ప్రేమజంట

## ఆత్మహత్య

- చికిత్స పొందుతూ ప్రియుడి మృతి
- యువతి పరిస్థితి విషమం

2

గురుకులంలో

## విద్యార్థి మృతి

- బాధిత కుటుంబ సభ్యుల అనుమానం
- దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

4



# బీసీ రిజర్వేషన్లపై నేడు హైకోర్టులో విచారణ

- మంత్రులు, అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్, మన చౌరాస్తా :** బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సామాజిక న్యాయం దిశగా చారిత్రాత్మక నిర్ణయంగా భావిస్తున్న ఈ వ్యవహారంలో ఏ మాత్రం నిర్లక్ష్యం జరగకుండా ఉండేందుకు సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారు. బుధవారం హైకోర్టులో కేసు విచారణకు రానున్న సందర్భంగా మంత్రులు, న్యాయ నిపుణలుతో చర్చించారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశం సామాజిక సమతుల్యతకు సంబంధించిన కీలకమైన అంశమని ప్రభుత్వం భావిస్తోంది. కేసు పురోగతిని గంట గంటకు పర్యవేక్షిస్తూ, న్యాయపరంగా ఏ మార్పులు వచ్చినా తక్షణమే వ్యూహాన్ని సవరించుకునేలా ప్రత్యేక టీమ్‌ను సీఎం రేవంత్ ఏర్పాటు చేశారు. న్యాయ పోరాటంతో పాటు రాజకీయ, సామాజిక వర్గాల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు కూడా సమాంతరంగా కొనసాగుతున్నాయి. సుప్రీంకోర్టు నుంచి హైకోర్టు దాకా ప్రతి దశలోనూ బీసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం తన పూర్తి శక్తిని వినియోగిస్తోంది. సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా తెలంగాణ తరపున ప్రముఖ న్యాయ నిపుణులు అభిషేక్ సింగ్వి, సిద్దార్థ దవే లు హాజరై వాదనలు వినిపించారు. ఈ విచారణకు ముందే సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశాలు ఇవ్వడంతో, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి లతో కూడిన బృందం ఢిల్లీ వెళ్లి న్యాయ నిపుణులతో విస్తృతంగా చర్చించింది. కేసు ప్రాధాన్యత దృష్ట్యా భట్టి విక్రమార్క, మంత్రుల బృందం స్వయంగా సుప్రీంకోర్టు విచారణను ప్రత్యక్షంగా పర్యవేక్షించింది. ఈ క్రమంలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింగ్వి తో ఫోన్ లో మాట్లాడారు. బుధవారం హైకోర్టులో జరగనున్న బీసీ రిజర్వేషన్ల కేసు విచారణకు స్వయంగా హాజరై వాదనలు వినిపించాలని ఆయన కోరారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఢిల్లీలో సింగ్విని కలసి ఇదే విషయమై విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత సున్నితమైనదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా న్యాయస్థానంలో బలమైన వాదనలు వినిపించాలని వారు కోరారు. హైకోర్టులో జరగనున్న విచారణకు ముందు, కేసు పురోగతిపై సమగ్ర సమీక్ష జరపాలని సీఎం నిర్ణయించారు.



SRIRAMA TRANSPORT
TRUSTED GOODS CARRIER - ON TIME, EVERY TIME
Kemidi Ramesh
9849146698
OUR SERVICES
All Goods Vehicle
Mini Goods Carrier
24x7 Transport Service
House Shifting, Packers & Movers

# ఎంపీటీసీ, జడ్పీటీసి ఎన్నికలకు మొదటి ర్యాండమైజేషన్ పూర్తి

**జనగామ, మన చౌరాస్తా :**

జిల్లాలో 12 మండలాలలోని 12 జడ్పీటీసీ స్థానాలకు, 134 ఎంపీటీసీ ఎన్నికల సిబ్బంది ఎంపిక సందర్భంగా మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ నిర్వహించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఎంపిటిసి, జడ్పీటీసి ఎన్నికల నిర్వహణకు మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను సంబంధిత జడ్పీ అధికారులు, ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్షించారు. ఎన్నికల నిర్వహణకుగాను పీవోలుగా 940, ఏపీవోగా 940, పోలింగ్ అధికారులుగా 2,373 మందిని ఎంపిక చేశారు. ఎంపిక చేసిన ఎన్నికల అధికారులకు ఎన్నికల నిర్వహణపై మండల కేంద్రాలలో ఈ నెల 10న శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జడ్పి సీఈవో మాధురీ షా, డిప్యుటీ సీఈవో సరిత, డీపీవో స్వరూప, డీఎల్పీవో వెంకటరెడ్డి, ఈడీఎం గౌతమ్, మాస్టర్ ట్రైనీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వాల్మీకి జయంతి

**వరంగల్, మన చౌరాస్తా :** మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకోవడం ద్వారా వారి మార్గంలో పయనించి అనుకున్న లక్ష్యాలను సునాయాసంగా సాధించవచ్చు అనడానికి వాల్మీకి మహర్షి జీవితం నిదర్శనమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. కలెక్టరేట్లో గురువారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్పలత, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

### పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**పాలకుర్తి, మన చౌరాస్తా :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కోరారు. మంగళవారం పాలకుర్తి మండల కేంద్రంలో రాయపర్తి మండల ప్రధాన నాయకులతో కలిసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువనాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ తీరుపై విశ్లేషణ చేస్తూ, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. 'రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తుకు అత్యంత కీలకం. ప్రతి గ్రామంలో, ప్రతి బూత్ స్థాయిలో కాంగ్రెస్ బలాన్ని పెంచి, పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి' అని పిలుపునిచ్చారు. సమావేశంలో బ్లాక్, రాయపర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ టీపీసీసీ కార్యదర్శులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, యువకార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

# క్రీడల్లో జిల్లాకు పేరు తీసుకురావాలె

### ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అజీజ్ ఖాన్

**హనుమకొండ, మన చౌరాస్తా :** జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అజీజ్ ఖాన్ అన్నారు. హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో మంగళవారం అండర్ 19 జూనియర్ కళాశాలల కబడ్డీ, ఫుట్ బాల్ సెలక్షన్స్ నిర్వహించారు. అండర్ 19 జూనియర్ కళాశాలల ఆర్గనైజింగ్ సెక్రటరీ నారెడ్ల శ్రీధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అజీజ్ ఖాన్ హాజరై మాట్లాడారు. అంతర్జాతీయ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. హనుమకొండను క్రీడ హబ్ గా చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పోటీల ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీధర్ మాట్లాడుతూ జూనియర్ కళాశాలల కబడ్డీ, ఫుట్ బాల్ సెలక్షన్స్ కు అద్భుత స్పందన లభించిందని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 300 మంది క్రీడాకారులు సెలక్షన్లో పాల్గొన్నారని తెలిపారు.



ఇందులో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలో పంపుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు ప్రభాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రేమ్ ప్రసాద్ రావు, బరుపాటు గోపి, సతీష్, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, కుమార్, రాముడు, గోవర్ధన్, ఆమని, కోచ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## కండీషన్‌లో ఉన్న వాహనాలనే వినియోగించాలి

### అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

**జనగామ, మన చౌరాస్తా :** మున్సిపాలిటీలో కండీషన్ ఉన్న వాహనాలనే వాడాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ సూచించారు. మంగళవారం జనగామ మున్సిపాలిటీ కార్యాలయాన్ని సందర్శించి పారిశుద్ధ్య వాహనాల పనితీరును పరిశీలించారు. వాహనాలను వాటి వినియోగాన్ని సెక్షన్ల వారీగా నిర్వహణ పనులను చెక్ చేశారు. ప్రస్తుత వాహనాల కండిషన్ ఎలా ఉంది, వాటి నిర్వహణకు చేస్తున్న ఖర్చును అడిగితెలుసుకున్నారు. మున్సిపాలిటీ లో ప్రస్తుతం 22 వాహనాలతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని, 3 ట్రాక్టర్లు, 5 ఆటో ట్రాలీ లు ఉంటే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతామని మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం పనిచేస్తున్న వాహనాల కండీషన్ పై ముందుగా నివేదిక ఇవ్వాలని అదనపు కలెక్టర్ రవాణా శాఖ అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, ఆర్ టి ఓ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ ప్రియుడి మృతి
- యువతి పరిస్థితి విషమం



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలం తాటికొండ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. ఓ ప్రేమజంట గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన స్థానికులను కలచి వేసింది. తాటికొండ గ్రామానికి చెందిన మారపాక అన్వేష్ (26), గడ్డం పావని (22) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. అయితే కుటుంబ సభ్యుల అంగీకారం లభించకపోవడం వల్ల మానసిక వేదనకు గురైన ఈ జంట ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు వారిని గుర్తించి ఘనపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి వారిని హన్మకొండ లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ యువకుడు అన్వేష్ మృతి చెందగా, యువతి పావని పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సీజేఐ గవాయ్‌పై దాడి హేయనీయం



**జనగామ, మన చౌరాస్తా:** భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బీఆర్ గవాయ్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తు తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం జనగామ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్లకార్డులతో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నారపు శివశంకర్ నేతృత్వంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ కి మద్దతుగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది సాదిక్ అలీ, ప్రముఖ వైద్యులు డాక్టర్ సిహెచ్ రాజమౌళి, డాక్టర్ పీ సుగుణాకర్ రాజు, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అవిలయ్య మాట్లాడుతూ చీఫ్ జస్టిస్ గవాయ్ పై జరిగిన దాడి యావత్ దళిత సమాజంపై జరిగిన దాడిగా పేర్కొన్నారు. గౌరవ ప్రదమైన న్యాయవాద వృత్తిలో ఉన్న నిందితుడు రాకేశ్ కిశోర్ మతోన్మాదంతో సర్వోన్నత న్యాయ వ్యవస్థ పై దాడి చేయడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నిందితుడు రాకేశ్ కిశోర్ ని దేశ ద్రోహిగా ప్రకటించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజాస్వామిక వాదులందరితో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి నర్సింగరావు, వాంకుడోత్ అనిత, మేకల శంకరయ్య, కన్నారపు పరశురాములు, గద్దల కిశోర్, బొట్ల మహేష్, ఎండబట్ల భాస్కర్, బొట్ల నర్సింగరావు, గంగారపు జితేందర్, జేరిపోతుల కుమార్, యాసారపు కరుణాకర్, మాచర్ల ఆశీశ్, బాషపాక మణి కుమార్, గద్దల సాయి, మచ్చ కుమార్, తూడి ఆనంద్, జేరిపోతుల ఉపేందర్, ప్యాట రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఈవీఎం గోదాంను పరిశీలించిన
# వరంగల్ కలెక్టర్

**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో జిల్లా గోదాములను కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళవారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు లోని జిల్లా ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేసి,ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించి వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్, నాయబ్ తహసీల్దార్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

**ఎన్నికల కౌంటింగ్ కేంద్రం పరిశీలన**

స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్ కేంద్ర ఏర్పాట్లను మంగళవారం వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా పరిషత్తు సీఈఓ రామిరెడ్డి లతో కలసి ఏనుమామూలుగా మార్కెట్ యార్డులో వరంగల్ జిల్లాలోని 11 మండలాలకు సంబందించిన జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను, క్షేత్రస్థాయిలో పరిశీలించి పటిష్టంగా నిర్వహించుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ లోని గోడౌన్ నెంబర్ 17ఏ, 17బి, 17సి, 17డి గదులను కలెక్టర్ పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఏర్పాట్లకు గాను గదుల విస్తీర్ణాన్ని పరిశీలించారు. పోలింగ్ అనంతరం జిల్లాలోని 11 మండలాల బ్యాలెట్ బాక్స్ లను భద్రపర్చడానికి స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్లు పక్కపక్కనే ఉండేలా చూడాలన్నారు. ప్రతి కౌంటింగ్ హాల్లో మండలానికి సుమారుగా 14 టేబుళ్లు చొప్పున 11 మండలాలకు కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేయాలని, ఏ విధంగా అమరిస్తే సౌకర్యంగా ఉంటుందో పక్కా ప్రణాళిక చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల , ప్రాంతాలలో భద్రత అత్యంత కట్టుదిట్టంగా ఉండాలన్నారు. సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల సామగ్రి గది, కమ్యూనికేషన్ గది, అబ్జార్వర్ల గది ఏర్పాటు చేసే ప్రాంతాలను పరిశీలించారు.అవసరమైన మరమ్మత్తులు, సరిపడా లైటింగ్, కావలసిన వసతులతో పటిష్టమైన ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ కల్పన, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, హౌసింగ్ పిడి గణపతి,తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.






## 'ఆదర్శ' విద్యార్థులకు వృత్తి విద్య శిక్షణ

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** వృత్తి విద్యలో భాగంగా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులు క్షేత్రస్థాయిలో శిక్షణ పొందుతున్నారు. పాఠశాలలో పర్యాటక వసతి నిర్వహణ, సౌందర్య సంరక్షణ అనే రెండు వృత్తి విద్యా కోర్సులు అమలులో ఉన్నాయి.ఇందులో భాగంగా పర్యాటక విభాగ విద్యార్థులు హుజూరాబాద్‌లోని శ్రీరామ హోటల్ నిర్వహణ కళాశాలలో పది రోజుల శిక్షణ పొందుతుండగా, సౌందర్య సంరక్షణ కోర్సు విద్యార్థులు హనుమకొండలోని కట్స్ అండ్ కర్ల్స్ సౌందర్య కేంద్రంలో శిక్షణ పొందుతున్నారు.ఈ శిక్షణ విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

# కాషాయ జెండా ఎగరేయాలి



**వరంగల్, మన చౌరాస్తా :** ప్రజలంతా బీజేపీవైపే ఉన్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరడం ఖాయమని జిల్లా ఎన్నికల కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం సత్యం కన్వెన్షన్ హాల్ లో మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఆరూరి రమేశ్‌తో పాటు మాజీ పార్లమెంటు సభ్యులు ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్, మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్, డాక్టర్ టి.రాజేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కంభంపాటి పుల్లారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ అధిష్ఠానం జడ్పీటిసి, ఎంపీటీసీ ఎన్నికలలో పోటీచేసే ఆశావహుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎడ్ల అశోక్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, గురుమూర్తి శివకుమార్, రత్నం సతీష్ షా, వన్నాల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరి శంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జక్కు రమేష్, వనం రెడ్డి, పార్లమెంటు కన్వీనర్ తాళ్ల పెల్లి కుమారస్వామి, మాజీ జడ్పిటిసి సునీత తదితరులు పాల్గొన్నారు.



### కొనుగోలు కేంద్రాల్లో అన్ని
# వసతులు ఉండాలి

**అదనపు కలెక్టర్ బెన్న లోమ్**

**జనగామ, మన చౌరాస్తా :** పక్కా ప్రణాళికతో ఈనెల 10వ తేదీ నుండి ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ, బె న్న లోమ్ తెలిపారు. వానాకాలం(ఖరీఫ్) పంట కొనుగోలుకు సంబంధించి జిల్లా, మండల, గ్రామ స్థాయి సిబ్బంది, కొనుగోలు కేంద్రాల కమిటీ సభ్యులతో మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హల్ లో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కేంద్రంలో కొనుగోలు కి సంబంధించిన రిజిస్టర్లు, తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, వేయింగ్ యంత్రాలు, టార్పాలిన్లు ఏర్పాటు చేసుకుని రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సజావుగా కొనుగోలు చేపట్టాలని అదేశించారు.

## రాజిరెడ్డికి ఏఎస్సైగా ప్రమోషన్



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ పోలీస్ స్టేషన్లో గత రెండు సంవత్సరాలుగా హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న పాడి రాజిరెడ్డి మంగళవారం నాడు ఏఎస్ఐ గా ప్రమోషన్ పొందాడు. ఈ క్రమంలో సీఐ పులి రమేష్, ఎస్సై ఎన్ రాజులు రాజిరెడ్డిని అభినందించారు.



## మంత్రి అడ్లూరిపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

హుస్నాబాద్, మన చౌరాస్తా : హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. దళిత మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను అసభ్యంగా దూషించిన నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను ఎమ్మార్పీఎస్ నాయకులు దహనం చేశారు. ఈ ఘటనను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎనగందుల లక్ష్మినారాయణ, ఎం.ఎస్.పి రాష్ట్ర అధ్యక్షుడు ఇంజం వెంకటస్వామి, ఎంఎస్పి రాష్ట్ర కార్యదర్శి మారపెల్లి శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ ఇంచార్జ్ మాట్లా వెంకటస్వామి, హుస్నాబాద్ మండల ఇంచార్జ్ అశోక్, హుస్నాబాద్ టౌన్ అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు శంకర్ బాబు, చిగురుమామిడి మండలం ఇంచార్జ్ మల్లయ్యతో పాటు కోహెడ, అక్కన్నపేట నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బిల్లులు ఇవ్వాలి : వెంకట్ మావో

చేర్యాల, మన చౌరాస్తా : చేర్యాల మండలంలోని ఇందిరమ్మ ఇల్లుల గృహ నిర్మాణదారుల పరిస్థితి దయనీయంగా మారింది. అప్పులు తీర్చలేక.. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయలేక ఇద్దరమ్మా ఇళ్ళులా లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట్ మావో అన్నారు, మంగళవారం సిపిఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకట్ మావో మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇల్లుల బిల్లుల మంజూరులో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బిల్లులు రాక ఇందిరమ్మ లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని ఇది ప్రభుత్వానికి పట్టడం లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధల ప్రకారం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లకు పనులు పూర్తయినా డబ్బులు ఇంకా బ్యాంకు ఖాతాలో జమ కావడం లేదని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.ఇల్లు మంజూరైన లబ్ధిదారులు కట్టుకోకపోతే రద్దు చేస్తామని అప్పుడు అధికారులు లబ్ధిదారులు ఇబ్బంది పెట్టడంతో వచ్చిన ఇల్లు పోవద్దని లబ్ధిదారులు వడ్డీకి డబ్బులు తెచ్చి ఇళ్లను నిర్మించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో లబ్ధిదారులు మనస్థాపానికి గురవుతున్నారని అన్నారు. బిల్లులు రాక తీసుకున్న వడ్డీ పెరుగుతోందని, ఇల్లు లేకున్నా.. ఈ బాధ ఉండేది కాదని లబ్ధిదారులు బాధపడుతున్నారని స్పష్టం చేశారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి లబ్ధిదారులకు విడుతల వారిగా డబ్బులు లబ్ధిదారుల ఖాతాలో జమ చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. లేనియెడల లబ్ధిదారులతో కలిసి ప్రభుత్వ కార్యాలయలను ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో చేర్యాల మండల కార్యదర్శి బండకింది అరుణ్, రాజు, మల్లేశం, ఎల్లయ్య, భాస్కర్, చెందు పాల్గొన్నారు.





# గురుకుల విద్యార్థి అనుమానాస్పద మృతి

- **బాధిత కుటుంబ సభ్యుల అనుమానం**
- **దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డ గ్రామ శివారులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి సనాధుల వివేక్ (13) అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. వివరాల ప్రకారం, మృతుడు నంగునూరు గ్రామానికి చెందిన సత్యనారాయణ కుమారుడు. సత్యనారాయణ స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో చిన్న ఉద్యోగం చేస్తూ జీవనోపాధి సాగిస్తున్నారు. వివేక్ 5వ తరగతి నుంచే గురుకుల పాఠశాలలో హాస్టల్‌లో చదువుకుంటూ ఉండగా, ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు ముగిసిన తరువాత సోమవారం తన కుమారుణ్ని హాస్టల్‌లో దింపి వెళ్లిన తండ్రి సత్యనారాయణకు మరుసటి రోజు ఉదయం విషాదవార్త అందింది. మంగళవారం ఉదయం అల్పాహారం తరువాత సెకండ్ ఫ్లోర్‌లో ఆడుకుంటున్న సమయంలో వివేక్ మెడకు నైలాన్ దారం చుట్టుకొని చనిపోయాడని ఉపాధ్యాయులు తెలిపారు.



సుమారు ఉదయం 11 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకోగా, ఉపాధ్యాయులు వెంటనే వివేక్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులకు సమాచారం అందించగా, వారు వెంటనే అక్కడికి చేరుకుని తల్లిదండ్రులను సమాచారం అందజేశారు. ఆసుపత్రికి చేరుకున్న తల్లిదండ్రులు తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడన్న నమ్మకం లేదని, ఇది హత్యేనని అనుమానం వ్యక్తం చేశారు. హాస్టల్ సిబ్బంది లేదా విద్యార్థులు ఈ ఘటనకు కారణమై ఉండవచ్చని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు హాస్టల్‌కి వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతుని తల్లిదండ్రులు, బంధువులు హాస్టల్ ముందు ధర్నా నిర్వహిస్తూ "వివేక్ మృతికి న్యాయం చేయాలి" అని డిమాండ్ చేశారు. దాదాపు గంటపాటు రహదారి దిగ్బంధనం కూడా చేశారు. దీంతో పోలీసులు వారిని సమాధానపరుస్తూ పూర్తి స్థాయి విచారణ జరిపి, తప్పిదులు నిర్ధారణ అయినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వివేక్ మృతి పట్ల తల్లిదండ్రులు, బంధువులు కన్నీటి పర్వంతమవగా, స్థానికులు ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో విచారణ కమిటీ ఏర్పాటు చేసి మృతునికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# మావోయిస్టు నేత మంద రూబెన్ లొంగుబాటు

- **నాలుగు దశాబ్దాలు అజ్ఞాతంలోనే..**
- **రూబెన్‌పై రూ.8 లక్షల రివార్డు**
- **వివరాలు వెల్లడించిన వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్**

**హనుమకొండ, మన చౌరాస్తా :** మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి, సౌత్ బస్తర్, డివిజనల్ కమిటీ సభ్యుడు, దండాకారుణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన మంద రూబెన్ అలియాస్ కన్నన్న అలియాస్ మంగన్న అలియాస్ సురేష్ (67) వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఎదుట మంగళవారం లొంగిపోయాడు. ఈ లొంగుబాటుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ వివరాలు వెల్లడించారు. హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపాడు గ్రామానికి చెందిన మంద రూబెన్ 1979 సంవత్సరంలో కాజీపేటలోని ఆర్.ఈ.సిలో హాస్టల్ మెస్ విభాగంలో పనిచేస్తున్న సమయంలో రాడికల్స్ యూనియన్స్ నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు ఆకర్షితుడై మావోయిస్టు పార్టీమాజీ ప్రధాన కార్యదర్శి, ఒక్కప్పటి ఆర్. ఈ.సి పూర్వ విద్యార్థి నంబాల కేశవరావు పిలుపు నందుకొని మావోయిస్టు పార్టీలో చేరి అజ్ఞతంలోని వెళ్ళిపోయాడు. 1981సంవత్సరం నుండి 1986 వరకు నేషనల్ పార్క్ దళ కమాండర్ లంక పాపిరెడ్డి నాయకత్వంలో దళ సభ్యుడిగా కుంట, బస్తర్ ప్రాంతాల్లో పనిచేసాడు. 1987లో మావోయిస్టు పార్టీ నాయకత్వం రూబెన్ ను ఏరియా కమిటీ సభ్యుడిగా అప్పగించడం జరిగింది. 1991లో అనారోగ్యం కారణంగా




చికిత్స కోసం కొత్తగుడెంకు వెళుతున్న సమయంలో చత్తీస్గఢ్ పోలీసులు అరెస్ట్ చేసి జగదల్పూర్ జైలు తరలించగా, ఒక సంవత్సరం అనంతరం రూబెన్ మరో ముగ్గురు ఖైదీలతో కలసి జైలు నుండి తప్పించుకున్నాడు. 1992 లో జైలు తప్పించుకున్న రూబెన్ తిరిగి మావోయిస్టు పార్టీలో కలిసి ఏరియా కమిటీ సభ్యుడిగా కుంట, అబుజ్ మడ్ ప్రాంతాల్లో 1999 వరకు పనిచేసాడు. ఇదే సంవత్సరంలో సెంట్రల్ కమిటీ సభ్యుడు రావుల శ్రీనివాస్ అలియాస్ రామన్న గోపన్న నేతృత్వంలో బీజాపూర్ జిల్లా, గుండ్రాయి గ్రామానికి చెందిన పొడియం భీమేతో రూబెన్ కు వివాహం జరిపించారు. 2005 సంవత్సరం డివిజన్ కమిటీ సభ్యుడి పనిచేస్తున్న సమయంలో అనారోగ్యం కారణంగా పార్టీ ఆదేశాలతో రూబెన్ గుండ్రాయి గ్రామంలోనే భార్య, పిల్లలతో నివాసం వుంటూ, కోళ్లు, గొర్రెలు ఫారాలు నిర్వహిస్తూనే స్థానిక గ్రామ కమిటీలతో కలసి చురుకుగా పని చేసే వాడు. ఇదే సమయంలో మావోయిస్టు పార్టీ నాయకులతో పాటు దళ సభ్యులకు షెల్టర్, భోజన వసతులను కల్పిస్తూనే పోలీసుల కదలికలను గమనిస్తూ మావోయిస్టులకు సమాచారం అందిస్తూ మావోయిస్టు పని చేసేవాడు. అనారోగ్యం బాధపడుతున్న రూబెన్, ఉద్యమంలో పాల్గోడంలో శరీరం సహకరించకపోవడం. ముఖ్యంగా మావోయిస్టు సిద్దాంతాలకు కాలం చెల్లిపోవడం, ప్రజలకు మావోయిస్టులపై వ్యతిరేకత రావడంతో పాటు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న పురావాస పథకాల ద్వారా ప్రశాంతవంతమైన వాతావరణంలో తన కుటుంబ సభ్యులతో జీవించాలని, నిర్ణయించుకొని పోలీసుల ఎదుట రూబెన్ లొంగిపోవడం జరిగిందని సీపీ తెలియజేశారు. రూబెన్ పై 8లక్షల రూపాయల రివార్డ్ వుందని పోలీస్ కమిషనర్ వెల్లడించారు.



# మతోన్మాదిని కఠినంగా శిక్షించాలి

**చేర్యాల, మన చౌరాస్తా :** దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్‌పై మతోన్మాద లాయర్ చేసిన దాడి యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. దీనికి నిరసనగా చేర్యాల మండలం గుర్జకుంట గ్రామంలో ప్రజాస్వామ్య వాదులతో కలిసి కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. అదేవిధంగా చేర్యాల పట్టణ కేంద్రంలో ఆర్ఎస్ఎస్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనం రమేష్ మాట్లాడుతూ ఈ దాడి ఒక వ్యక్తిపై కాదని భారత దేశం యొక్క ప్రామాణికం భారత రాజ్యాంగం పై దాడి అని ప్రపంచ దేశాల ముందు ప్రజాస్వామ్య ఔన్నత్యాన్ని కించపరిచే చర్య అన్నారు. సనాతన ధర్మం ముసుగులో రాజ్యాంగ న్యాయ వ్యవస్థపై చేసిన దాడి దేశ విద్రోహ చర్య అని, ఒక మతాన్ని ప్రాతిపదికగా తీసుకొని దేశం యొక్క రాజ్యాంగాన్ని అగౌరవపరచడం దేశభక్తి ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఇలాంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ, మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ.. రాజకీయ లబ్ధి పొందుతున్న ఆర్ఎస్ఎస్ సంస్థని స్వయంగా దేశ ప్రధాని స్వాతంత్ర సంబరాల్లో భాగంగా ఎర్రకోట సాక్షిగా జెండా ఎగరవేసి స్వాతంత్రోద్యమానికి ఏమాత్రం సంబంధంలేని, బ్రిటిష్ పాలకులకు తొత్తులుగా పనిచేసినటువంటి ఆర్ఎస్ఎస్ ని కొనియాడడం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో వ్యా.కా.స మండల కార్యదర్శి బోయిని మల్లేశం, ప్రజా, సామాజిక సంఘాల నాయకులు, అలీం, మల్కాని ఎల్లయ్య కనకవ్వ, మెర్గోజు రాం ప్రసాద్, యాడారం బ్రమ్మయ్యా రమేష్, తిరుపతి, రాజు భాను, ప్రజాస్వామ్యవాదులు , గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మ్యూజియం పనులను పూర్తి చేయాలి

**వరంగల్, మన చౌరాస్తా :** చారిత్రక నేపథ్యమైన వరంగల్ కోటలోని మ్యూజియం పనులను పూర్తి చేయాలని రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ కె అర్జున్ రావు అన్నారు. మంగళవారం మ్యూజియంతో పాటు శంభునిగుడిని అభివృద్ధి మరింత అభివృద్ధి చేయాలని వాటి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వారి వెంట స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ నాగరాజు అడిషనల్ డైరెక్టర్ బుజ్జి పర్యాటక శాఖ జిల్లా అధికారి శివాజీ ఏ ఈ విజయ్ టూరిజం గైడ్ రవి యాదవ్ సౌండ్ అండ్ లైట్ షో ఇన్చార్జ్ అజయ్ పురావస్తు సిబ్బంది టూరిజం సిబ్బంది వారి వెంట ఉన్నారు.

